
www.kalamdaily.com
Follow on: Kalamtelugu
కలం
ప్రజల గళం...
25-02-2026, బుధవారం పేజీలు: 2

360° SINGLE TOPIC

## కుటుంబాలు.. విషాదాలు

తెలంగాణలో ఆత్మహత్యలు (ఎన్సీఆర్‌బీ రిపోర్టుల ప్రకారం)




(నోట్: 2024, 2025 ఎన్సీఆర్‌బీ రిపోర్టులు ఇంకా విడుదల కాలేదు)

# ఫ్యామిలీ సూసైడ్స్

## పెరిగిపోతున్న విపరీత ధోరణి

**తల్లి, తండ్రి, కొడుకు.. ఓ చిన్న కుటుంబం! కొడుక్కు 24 ఏండ్లు. జాబ్‌లో సెట్ చేసి, ఇంటివాణ్ని చేయాల్సిన టైమ్ వచ్చింది. కానీ, కలిసికట్టుగా ఆ కుటుంబం దారుణ నిర్ణయం తీసుకుంది. తల్లీతండ్రి ఉరేసుకోగా.. కొడుకు చేతి మణికట్టు కోసుకొని ప్రాణాలు వదిలాడు. ఇదీ తాజాగా హైదరాబాద్‌లో జరిగిన విషాదం!!**


ఇటీవల ఉప్పల్‌కు చెందిన తల్లి, కూతురు, కొడుకు.. ఒకరినొకరూ హత్తుకుని ఘట్‌కేసర్-చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలపై గూడ్స్ రైలుకు ఎదురెళ్లి చనిపోయారు. "ఈ జీవితం చాలా భారంగా ఉంది. బతకాలని ప్రయత్నించినా.. బతకలేకపోతున్నా. పిల్లలను వదిలి వెళ్లలేక నాతో పాటు తీసుకెళ్తున్నా.." అని ఆ తల్లి రాసిన సూసైడ్ నోట్‌లో ఉంది.

**... ఒకటి కాదు రెండు కాదు, ఈ మధ్య ఇలాంటి దారుణాలు పెరిగిపోయాయి. కన్న బిడ్డలను చంపి, పెద్దలు ఆత్మహత్య చేసుకోవడం.. "నువ్వు లేకుంటే మేం లేం" అనే భావనతో కుటుంబాలకు కుటుంబాలే బలవన్మరణానికి పాల్పడటం.. అనే విపరీత ధోరణి సమాజంలో వ్యాపిస్తున్నది.**

కరోనా తర్వాత తలెత్తిన పరిస్థితులతో చాలా మందిలో మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ పెరిగిపోయాయి. చిన్న చిన్న సమస్యలకు కంగారు పడుతున్నారు. ధైర్యం చెప్పే తోడు లేక, ఎలా ఉన్నారని పలకరించే దిక్కు లేక దారుణ నిర్ణయాలు తీసుకుంటున్నారు. సమస్య ఎదురైతే దాని నుంచి బయటపడే దారిని వెతికే బదులు.. కుటుంబాలకు కుటుంబాలే మృత్యువు ముఖంలోకి తలదూర్చుతున్నాయి. ఒకప్పుడు సమస్య ఎదురైన వ్యక్తే తనను తాను శిక్షించుకునే వాడు. కానీ, ఇప్పుడు ఫ్యామిలీ మొత్తం బలవన్మరణాలకు పాల్పడుతుండటం సమాజాన్ని వేలెత్తి చూపిస్తున్నది. దీనికి కారణాలు ఏమిటి? పరిష్కారం ఎక్కడ?..

ఫ్యామిలీ సూసైడ్స్‌పై **కలం 360 డిగ్రీస్** కథనం..

తెలంగాణ బ్యూరో, కలం



### సూసైడ్ రేటులో 5వ స్థానం..

తెలంగాణలో ఆత్మహత్యల రేటు జాతీయ సగటుతో పోలిస్తే చాలా ఎక్కువగా ఉంది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో–2023 రిపోర్టు ప్రకారం రాష్ట్రంలో మొత్తం 10,580 ఆత్మహత్యలు నమోదయ్యాయి. సూసైడ్ రేటు జాతీయ సగటు 12.3% ఉండగా, అది తెలంగాణలో 27.7% ఉంది. అంటే రాష్ట్రంలో ఏటా ప్రతి లక్ష మందిలో 27.7 మంది ఆత్మహత్య చేసుకుంటున్నారని అర్థం. దేశవ్యాప్తంగా సూసైడ్ రేటులో తెలంగాణ ఐదో స్థానంలో ఉండడం ఆందోళన కలిగిస్తున్నది.

### వివిధ రాష్ట్రాల్లో సూసైడ్ రేట్..

| | |
|---|---|
| అండమాన్ నికోబార్ | 49.6% |
| సిక్కిం | 40.2% |
| కేరళ | 30.6% |
| పుదుచ్చేరి | 28% |
| తెలంగాణ | 27.7% |
| చత్తీస్‌గఢ్ | 26% |

## ఎందుకిలా?

**గత కొంతకాలంగా కుటుంబ ఆత్మహత్యలు పెరిగాయి. ఏవైనా సమస్యలు ఉంటే వ్యక్తిగత సూసైడ్ లాంటి ఘటనలు గతంలో చూశాం. కానీ ఇప్పుడు కుటుంబమంతా కలిసి ఆత్మహత్య చేసుకుంటున్న ఘటనలు చూస్తున్నాం. ఇందుకు మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ కారణమని సైకియాట్రిస్టులు అంటున్నారు.**




- తాను చనిపోతే తన భార్య/భర్త, పిల్లలు ఏమైపోతారోననే ఆందోళన బాధితుల్లో కనిపిస్తున్నది. కుటుంబమంతా కలిసి చనిపోతే.. ఎవరికీ ఏ బాధలు ఉండవనే ధోరణి పెరిగిపోయింది.
- కరోనా తర్వాత ఇలాంటి పరిస్థితి ఎక్కువైంది. ప్రస్తుత కాలంలో ఒకరిని మరొకరు పట్టించుకునే పరిస్థితి లేదు. కనీసం పలకరించడం కరువైంది.
- ఆర్థిక సమస్యలు, ఇతర ఇబ్బందుల్లో ఉన్నవాళ్లను ఆదుకోవడానికి రక్త సంబంధీకులు, దగ్గరి బంధువులు, స్నేహితులు ఎవరూ ముందుకు రావడం లేదు. మాట సాయమైనా చేయట్లేదు.. మేమున్నామనే భరోసా ఇవ్వడం లేదు.
- ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. తల్లిదండ్రులు ఊర్లో ఉంటే.. పొట్ట కూటి కోసం బిడ్డలు పట్టణాల్లో ఉంటున్నారు. కుటుంబంలో ఏ సమస్యలు ఉన్నా అమ్మానాన్నకు చెప్పుకోలేని పరిస్థితి. అదే పెద్దల దగ్గర ఉంటే, వాళ్లు సముదాయించి భరోసా ఇచ్చే అవకాశం ఉంటుంది.
- సమాజంలో నెలకొన్న ఇలాంటి పరిస్థితులే సామూహిక ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని సైకియాట్రిస్టులు పేర్కొంటున్నారు.

**పిల్లలను చంపుతూ.. పెద్దల ఆత్మహత్యలు**

**ఆర్థిక, అనారోగ్య, కుటుంబ సమస్యలతో దారుణాలు**

**పలకరించే దిక్కులేక.. డిప్రెషన్‌తో కఠిన నిర్ణయాలు**




బాధలో ఉంటే ఫోన్ చేయండి
2వ పేజీలో

## ఎన్నో కారణాలు..

**ఫ్యామిలీ సూసైడ్స్‌కు అనేక కారణాలు ఉంటున్నాయి. ఆర్థిక, మానసిక, అనారోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. కుటుంబ ఆత్మహత్యల్లో దాదాపు 80 శాతం ఆర్థిక ఇబ్బందుల కారణంగానే జరుగుతున్నాయని పలు రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి.**

- ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక చాలా కుటుంబాలు ప్రాణాలు తీసుకుంటున్నాయి. బిజినెస్‌లో నష్టాలు, కుటుంబ అవసరాలు, ఇతరత్రా కారణాలతో బాధితులు బయట అప్పులు తీసుకుంటున్నారు. వాటిని చెల్లించలేని పరిస్థితుల్లో అప్పులోళ్ల బాధ భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.
- చిన్న చిన్న ఫైనాన్స్ కంపెనీలు, లోన్ యాప్‌లు కూడా ఫ్యామిలీ సూసైడ్స్‌కు కారణమవుతున్నాయి. బాధితులు తమ అవసరాలకు ఫైనాన్స్ కంపెనీ, యాప్స్‌లో లోన్ తీసుకొని చెల్లించని క్రమంలో.. ఆయా సంస్థల ఏజెంట్లు బాధితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు.
- ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, స్టాక్ మార్కెట్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టి నష్టపోవడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.
- పంట దిగుబడి రాక, మద్దతు ధర లభించక, అకాల వర్షాలతో నష్టాలు వాటిల్లి రైతులు అప్పుల పాలవుతున్నారు. వాటిని తీర్చే మార్గం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.
- కుటుంబ గొడవలతోనూ చాలా ఫ్యామిలీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నాయి. దంపతుల మధ్య మనస్పర్ధలు, వివాహేతర సంబంధాలు, ఆస్తి తగాదాలు తదితర సమస్యలు ఇందుకు కారణమవుతున్నాయి.
- అనారోగ్య సమస్యలు, ట్రీట్‌మెంట్‌కు డబ్బులు లేకపోవడం, పిల్లలు/పెద్దలు నయం కాని వ్యాధితో బాధపడడం లాంటివీ కుటుంబ ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి.

కలం
25-02-2026, బుధవారం

360° SINGLE TOPIC

# కుటుంబాలు.. విషాదాలు







## బాధితులకు అండగా టెలీ మానస్

మానసికంగా ఇబ్బందులు పడుతున్న వాళ్లకు అవసరమైన సాయం అందించేందుకు కేంద్రం 'టెలీ మానస్' సేవలను ప్రారంభించింది. ఇది అన్ని రాష్ట్రాల్లోనూ అమలవుతున్నది. కరోనా తర్వాత మానసిక ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు వంటి సమస్యలు పెరిగిపోయాయి. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఇతర కారణాలతో ఆత్మహత్యలు ఎక్కువయ్యాయి. డిప్రెషన్ కారణంగానే ఆత్మహత్య ఆలోచనలు వస్తుంటాయి. వీటిని నివారించేందుకు 'టెలీ మానస్' సేవలను దేశవ్యాప్తంగా ప్రారంభించారు. ఈ సెంటర్‌లో సైకియాట్రిస్టులు 24 గంటలూ అందుబాటులో ఉంటారు. టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే బాధితుల సమస్యకు పరిష్కారం చూపిస్తారు. అవసరమైతే ఆస్పత్రిలో చేర్పించి ట్రీట్‌మెంట్ అందిస్తారు.

**టెలీ మానస్ హెల్ప్‌లైన్: 14416**



## ఇంట్లో గొడవలతో..

**2025 అక్టోబర్ 13 :** ఏపీలోని కడపకు చెందిన శ్రీరాములు (35), శిరీష (30) దంపతులు. వీళ్ల కొడుకు రిత్విక్ (ఏడాదిన్నర). గొడవల కారణంగా భార్యాభర్తలు మనస్తాపం చెంది, కొడుకుతో సహా గూడ్స్ రైలుకు ఎదురెళ్లి చనిపోయారు.

## పిల్లలతో కలిసి రైలు కింద పడి..

**2026 జనవరి 31 :** హైదరాబాద్‌లోని ఉప్పల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయారెడ్డి (38).. కూతురు చేతనరెడ్డి(18), కొడుకు విశాల్ రెడ్డి(17) తో కలిసి ఆత్మహత్య చేసుకుంది. ముగ్గురూ ఒకరినొకరూ హత్తుకుని ఘట్‌కేసర్–చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలపై గూడ్స్ రైలుకు ఎదురెళ్లి చనిపోయినట్టు సీసీ టీవీ ఫుటేజీల్లో రికార్డయింది. ఈ విజువల్ ఎందరినో కదిలించింది. "జీవితం చాలా భారంగా ఉంది. బతకాలని ప్రయత్నించినా.. బతకలేకపోతున్నా. పిల్లలను వదిలి వెళ్లలేక నాతో పాటు తీసుకెళ్తున్నా.. మా చావుకు ఎవరూ కారణం కాదు" అని విజయారెడ్డి సూసైడ్ నోట్ రాసింది.





## బిడ్డలను చంపి తల్లీ..

**2026 ఫిబ్రవరి 07 :** ఏపీలోని తిరుపతి జిల్లా పుత్తూరుకు చెందిన శివకుమార్, పద్మ 8 ఏండ్ల కింద ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీళ్లకు తేజశ్రీ (7), లాస్య (5) కుమార్తెలు. శివకుమార్ ప్రైవేట్ జాబ్ చేస్తూ మానేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. భర్త బయటకు వెళ్లిన టైమ్‌లో.. ఇద్దరు పిల్లలతో కలిసి పద్మ ఫ్యాన్‌కు ఉరేసుకుంది.

## కవల బిడ్డలను చంపి..

**2025 అక్టోబర్ 14:** హైదరాబాద్‌లోని బాలానగర్‌కు చెందిన అనిల్ కుమార్, సాయిలక్ష్మి (27) దంపతులు. వీళ్లకు కవల పిల్లలు చేతన్ కార్తికేయ (2), లాస్యత వల్లి (2) ఉన్నారు. భర్తతో గొడవల కారణంగా సాయిలక్ష్మి తీవ్ర మనోవేదనకు గురైంది. చనిపోవాలని నిర్ణయించుకుంది. ముందుగా పిల్లలిద్దరినీ గొంతునులిమి చంపింది. అనంతరం ఆమె మూడో అంతస్తు నుంచి దూకి సూసైడ్ చేసుకుంది.

## ఆస్తి తగాదాలతో..

**2025 అక్టోబర్ 09 :**

ఏపీలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన చింతాడ సన్యాసిరావు(45), ఉమ(38) దంపతులు. వీళ్ల కొడుకు దీక్షిత్ (14). ఆస్తి తగాదాలతో అవమానం తట్టుకోలేక ముగ్గురూ చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నారు.

## అప్పులోళ్ల బెదిరింపులతో..

**2026 జనవరి 05 :**

ఏపీలోని తిరుపతికి చెందిన శివకుమార్ (45), మాధవి (39) దంపతులు. వీళ్లకు కొడుకు లఖిత్(14), కూతురు శ్రావణి(11) ఉన్నారు. శివకుమార్ చిట్ ఫండ్ వ్యాపారి. చిట్టీ డబ్బులు కొందరు కస్టమర్లు సరిగా కట్టకపోవడంతో నష్టపోయాడు. డబ్బులు ఇవ్వకుంటే ఇంటిని స్వాధీనం చేసుకుంటామని అప్పలోళ్లు బెదిరించారు. దీంతో మనస్తాపానికి గురైన దంపతులు.. ముందుగా పిల్లలకు విషం తాగించి, తర్వాత వాళ్లూ తాగారు. 'మానసిక ఒత్తిడి తట్టుకోలేకపోతున్నాం' అని సూసైడ్ నోట్ రాశారు.

## పరువు పోతుందనీ..

**2025 ఫిబ్రవరి 22 :** ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన శ్రీనివాసరావు (46), సంధ్య (40) దంపతులు. వీళ్లకు కొడుకు వంశీకృష్ణ(18), కూతురు శ్రావణి (15) ఉన్నారు. శ్రీనివాసరావుకు గోల్డ్ బిజినెస్‌లో భారీగా నష్టాలు వచ్చి, రూ.70 లక్షల దాకా అప్పులు అయ్యాయి. అప్పులోళ్ల వేధింపులతో కుటుంబ పరువు పోతుందని మనస్తాపం చెందాడు. కుటుంబ సభ్యులందరూ రైలు కింద పడి చనిపోయారు.



## జాబ్ కోల్పోయి.. ఇల్లు గడవక..

**2025 మార్చి10 :** హైదరాబాద్ హబ్సిగూడలో ఉండే ప్రైవేట్ లెక్చరర్ చంద్రశేఖర్ రెడ్డి(44), కవిత(35) దంపతులు. వీళ్లకు కూతురు శ్రీతారెడ్డి(13), కొడుకు విశ్వంత్ రెడ్డి(10) ఉన్నారు. కొన్నాళ్లుగా చంద్రశేఖర్‌కు జాబ్ లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు వచ్చాయి. దీంతో మనస్తాపానికి గురైన దంపతులు.. ముందుగా పిల్లలకు విషమిచ్చి, ఆ తర్వాత వాళ్లు ఉరేసుకున్నారు.

## అనారోగ్యంతో అప్పులపాలై..

**2026 జనవరి 18:** రంగారెడ్డి జిల్లాకు చెందిన శ్రీనివాస్ (38), లక్ష్మి (32) దంపతులు. వీళ్లకు సాత్విక్ (8), అన్విత్ (5) పిల్లలు. శ్రీనివాస్ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం రూ.లక్షల్లో ఖర్చు చేశాడు. ఇందుకోసం తనకున్న ఆస్తి అమ్మడంతో పాటు భారీగా అప్పులు చేశాడు. పెరిగిపోతున్న వైద్య ఖర్చులతో పాటు అప్పులు తీర్చే మార్గం లేక మదనపడిపోయాడు. తాము చనిపోతే పిల్లలు అనాథలు అవుతారని భావించి.. అందరం కలిసి చనిపోవాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. పిల్లలకు పాలల్లో విషం కలిపి ఇచ్చి, అనంతరం వాళ్లూ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు.